## రానున్న 6 నెలల్లో

# 3 లక్షల ఇళ్ల నిర్మాణం

- పట్టణ గృహ నిర్మాణ పథకాల కింద 1,40,559 ఇళ్ల నిర్మాణానికి కమిటీ ఆమోదం
- లబ్ధిదారులతో నిర్వహణ కమిటీలు
- స్టేట్ లెవెల్ శాంక్షనింగ్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎస్ఎల్ఎస్ఎంసి) సమావేశంలో సీఎస్ అనిల్ చంద్ర పునేఠ



**అమరావతి, ఆంధ్రప్రభ :** రాష్ట్రంలో వచ్చే ఆరు మాసాల్లో పట్టణ ప్రాంతాల్లో 3 లక్షల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠ చెప్పారు. సోమవారం సచివాలయంలోని ఆయన కార్యాలయంలో పట్టణ గృహ నిర్మాణాలకు సంబంధించి స్టేట్ లెవల్ శాంక్షనింగ్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎస్ఎల్ఎస్ఎంసి) సమావేశం సీఎస్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో హౌసింగ్ ఫర్ ఆల్, బి ఎల్సి కింద 8 అర్బన్ లోకల్ బాడీస్ (యుఎల్బి), 8 అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (యుడిఏ)ల్లో పట్టణ గృహ నిర్మాణ పథకాల కింద 1,40,559 ఇళ్ల నిర్మాణానికి కమిటీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా సీఎస్ పునేఠ మాట్లాడుతూ వచ్చే ఆరు నెల్లలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా పట్టణాల్లో 3 లక్షల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశించారు. పూర్తయిన ఇళ్ల సముదాయంలో వాటి నిర్వహణకు సంబంధించి స్థానిక లబ్ధిదారులతో హౌసింగ్ ఏఇ లేదా డిఇఇ అధ్యక్షతన ఒక నిర్వహణ కమిటీని ఏర్పాటు చేయాలని సీఎస్ సూచించారు. దాని వల్ల ఆయా గృహ సముదాయాల్లో ఎక్కడైనా చిన్నపాటి మరమ్మతులు తలెత్తినా లేక తాగునీటి సరఫరాలో ఇబ్బందులు వంటివి ఏర్పడినా వాటిని ఆ కమిటీ ద్వారా వెంటనే అలాంటి సమస్యలను పరిష్కరించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇందుకుగాను కొంత మొత్తాన్ని ఆయా కమిటీల వద్ద అందుబాటులో ఉంచాలని సీఎస్ సూచించారు. పట్టణ ప్రాంతాల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేసేందుకుగాను వివిధ పట్టణాల్లో విస్తృతంగా పర్యటించి గృహ నిర్మాణాలకు ఎక్కడ భూమి లభ్యత, ఇతర అంశాలు అనుకూలంగా ఉన్నాయో పరిశీలించి సకాలంలో ఈ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు తగిన కార్యాచరణ ప్రణాళికలను, డిపిఆర్‌లను సిద్ధం చేసి, కేంద్రానికి సమర్పించి సకాలంలో గృహాల మంజూరు పొందేందుకు కృషి చేయాలని సీఎస్ ఆదేశించారు. ఇందుకుగాను క్షేత్రస్థాయిలో మున్సిపల్ కమిషనర్లు, ఆర్డీవోలతో తరచూ సమన్వయం కలిగి పట్టణ గృహ నిర్మాణ పథకాలు వేగవంతంగా జరిగేలా చూడాలని ఏపీటిడ్కో ఎండీని సీఎస్ ఆదేశించారు. అంతకముందు ఏపీటిడ్కో ఎండీ బియం దివాన్ మైదీన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివిధ పట్టణాల్లో చేపట్టిన గృహ నిర్మాణ పథకాల ప్రగతిని వివరించారు. పట్టణ ప్రాంతాల్లో ప్రస్తుతం 3 లక్షల గృహాల నిర్మాణాలు మొదలయ్యాయని, వాటన్నింటిని వచ్చే ఆరు నెలల్లో పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ,సిసిఎల్ఏ మన్ మోహన్‌సింగ్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి కరికల వలవన్, గృహనిర్మాణ సంస్థ ఎండీ,కార్యదర్శి కాంతిలాల్ దండే, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సత్యనారాయణ,ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రభ Tue, 23 October 2018
epaper.prabhanews.com/c/33323766